క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుల నియామకం

డాబాగార్డెన్స్ : ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ మండల యువజన విభాగం అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. నియోజకవర్గ క్లస్టర్–1కి బూరడపాటి బంగార్రాజు, క్లస్టర్–2కి గార రవిశంకర్, క్లస్టర్–3కి గనగళ్ల రాజేష్, క్లస్టర్–4కి మీసాల అశోక్‌కుమార్‌ను నియమించారు.

సన్యాసిరావుకు సత్కారం



సన్యాసిరావును సత్కరిస్తున్న జాన్ వెస్లీ, సర్వేశ్వరరెడ్డి

సీతమ్మధార : సన్యాసిరావు సేవలు ప్రశంసనీయమని స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ అన్నారు. మోర్ని చిన్నమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ పేరుతో పలు కార్యక్రమాలు చేస్తున్న సన్యాసిరావును 27వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జాన్ వెస్లీ, సర్వేశ్వరరెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

'కళింగ కమ్యూనిటీ సమావేశంతో సంబంధం లేదు'



అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమైన డాక్టర్ పి.వి.రమణమూర్తి

సీతమ్మధార: ఖారవేల ఎడ్యుకేషనల్ కల్చరల్ అండ్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్(వైజాగ్ సిటీ కళింగ కమ్యూనిటీ) సర్వసభ్య సమావేశం ఈ నెల 24న జరుగుతుందని కొందరు చేసిన పత్రికా ప్రకటనతో తమకు ఎటువంటి సంబంధం లేదని అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పి.వి.రమణమూర్తి, సెక్రటరీ ఎం.కృష్ణారావు, ఉపాధ్యక్షుడు ముద్దాపు నర్సింహం, పూర్వ అధ్యక్షుడు పప్పల కృష్ణమూర్తి, కార్యవర్గ, కార్యనిర్వాహక సభ్యులు స్పష్టం చేశారు. ద్వారకానగర్‌లోని కళా ఆస్పత్రిలో డాక్టర్ రమణమూర్తి ఆధ్వర్యంలో ప్రతినిధులు సమావేశమై ఈ ప్రకటనను ఖండించారు. ఈ సమావేశం కార్యనిర్వాహక సభ్యుల సమాచారంతో గానీ, అనుమతితో గానీ జరుగుతున్నది కాదన్నారు. ఆదివారం నిర్వహించే సర్వసభ్య సమావేశానికి ఖారవేల ఎడ్యుకేషనల్ కల్చరల్ అండ్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు ఎటువంటి సంబంధం లేదని డాక్టర్ రమణమూర్తి, సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు.

సీసీ డ్రైన్ పనుల పరిశీలన



యాతపేట రోడ్డులో పనులు పరిశీలిస్తున్న తోట పద్మావతి

అల్లిపురం : జీవీఎంసీ 34వ వార్డు యాతపేట రోడ్డులో సీసీ రోడ్లు, కాలువ పనులు రూ.30 లక్షలతో చేపడుతున్నారు. ఈ పనులను వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి శనివారం పరిశీలించారు. ఆమెతో పాటు వార్డు సీనియర్ నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, దూడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపకరణాలకు దరఖాస్తుల స్వీకరణ

ఎంవీపీ కాలనీ: లాసన్స్ బే కాలనీ శాంతి ఆశ్రమం డెఫ్ అండ్ డెమ్ స్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో దివ్యాంగుల నుంచి ఉపకరణాల కోసం దరఖాస్తులు స్వీకరించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అలిమ్కో జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ దివ్యాంగులకు సమాజంలో సముచిత స్థానం లభించాలన్నారు. చదువు, క్రీడల్లో వారిని ప్రోత్సహించాలని కోరారు. 500 మంది దివ్యాంగులు ఉపకరణాలకు దరఖాస్తు చేసుకున్నారు. రూపాకుల రవికుమార్, జీవీఎంసీ ఏపీడీ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



వాసవీ భవన్‌లో ఏర్పాటు చేసిన సత్యదేవుని అలంకరణ



సామూహిక వ్రతంలో పాల్గొన్న దంపతులు



భక్తి సంగీత కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

వెల్లివిరిసిన.. ఆధ్యాత్మిక సోయగం

- భక్తులతో పోటెత్తిన ఆలయాలు
- ఉత్తర ద్వార దర్శనానికి భక్తుల బారులు
- గోవింద నామస్మరణతో మార్మోగిన 'బల్లిగిరి'



విశేష అలంకరణలో బల్లిగిరి ప్రసన్న వెంకటేశ్వరస్వామి



విశేష అలంకరణలో ఆంజనేయ సహిత సీతారామలక్ష్మణులు



వెంకన్న దర్శనానికి బారులు తీరిన భక్తులు



విశేష అలంకరణలో గోదాదేవి అమ్మవారు

అల్లిపురం : బల్లిగిరి శనివారం ముక్కోటి కళ సంతరించుకుంది. గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ముక్కోటి, వైకుంఠ ఏకాదశి సందర్భంగా వెంకన్నను దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారు జాము నుంచే బారులు తీరారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి తెల్లవారు జాము 3గంటల నుంచి విశేష పూజలు నిర్వహించారు. వెంకన్నను వజ్రకవచంతో విశేషంగా అలంకరించారు. అష్టదళ పద్మారాధన అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. ఆలయ మండపంలోని శేషపాన్పుపై శ్రీదేవీ, భూదేవీ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల గోత్రనామాలతో సహస్రనామాభిషేకాలు చేపట్టారు. భక్తులకు ఉచిత దర్శనాలు, రూ.50, రూ.100 క్యూ లైన్ల ద్వారా దర్శనాలు కల్పించారు. శనివారం, వైకుంఠ ఏకాదశి కావటంతో వేల సంఖ్యలో భక్తులు దర్శనానికి పోటెత్తారు. సాయంత్రం ఆలయ ఆవరణలో సహస్ర దీపాలంకరణ సేవ వైభవంగా చేపట్టారు. ఈ మేరకు భక్తులకు క్యూలైన్లు, ఇతర సౌకర్యాలు కల్పించినట్లు ఆలయ ఈవో జీవీ రమాబాయ్ తెలిపారు.

అలమేలు మంగమ్మ ఆలయంలో..

అలమేలు మంగమ్మ ఆలయంలో ఆలయ అర్చకుడు పాణంగిపల్లి కేశవాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు చేపట్టారు. భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. ఆలయంలో వెలసిన గోదాదేవి అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.

భక్తిశ్రద్ధలతో ఏకాహం..

అల్లిపురంలోని గోవింద్‌రోడ్డులో వెలసిన రాంరాం మందిరంలో ఏకాహం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు సుధా రామయ్యమ్మ ఆధ్వర్యంలో ఆలయంలో తెల్లవారు జాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం 6 గంటల నుంచి ఆదివారం తెల్లవారి 6 గంటల వరకు ఏకాహం సంకీర్తనల కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం జరిగిన అన్నసమారాధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆంజనేయ సహిత సీతారామ లక్ష్మణులకు విశేష పూజలు చేశారు.

అంబికాబాగ్ రామాలయంలో ఉత్తర ద్వార దర్శనం..

డాబాగార్డెన్స్ : మహారాణిపేటలో గల కనకమహాలక్ష్మి దత్తత దేవాలయం అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి దేవాలయంలో ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని శనివారం వేకువ జాము నుంచి భక్తులకు ఉత్తర ద్వారదర్శనం కల్పించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు సత్య రూపవాణి, ధనలత, వెంకటరత్నం, ఎస్. సతీష్, ఆలయ కార్యనిర్వాహక ఇంజినీరు సీహెచ్‌వీ రమణ, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు..

పాత నగరంలో గల వాసవీభవన్‌లో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. 120 మంది దంపతులు వ్రతంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నల్లూరి నూకరాజు, కార్యదర్శి పూసర్ల సురేష్‌కుమార్, పూసర్ల సుధీర్, కట్టమూరి సూర్యనారాయణ, గ్రంధి దుర్గాప్రసాద్, పాలూరి వరప్రసాద్, సోమేశ్వరరావు, జీవీఆర్ కుమార్, దుర్గా నూకేశ్వరరావు, కేఎస్ఎస్ ప్రసాద్, జీవీ రాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సిరులతల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాల 10వ రోజు శనివారం కనకమహాలక్ష్మి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని విశేష పూజలు చేశారు. పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, సర్వదర్శనం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్‌కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 3 వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఉపాధ్యాయిని ఎంపిక



రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలకు ఎంపికైన ఉపాధ్యాయిని శ్యామల

డాబాగార్డెన్స్ : జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీల్లో ఉపాధ్యాయ వ్యక్తిగత విభాగంలో జీవీఎంసీ ప్రకాశరావుపేట పాఠశాల గణిత ఉపాధ్యాయిని డి. శ్యామల రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆమె రూపొందించిన ట్రిగనోమెట్రిక్ పార్క్ నమూనా రాష్ట్ర స్థాయికి ఎంపికైంది.

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న వార్డు అధ్యక్షుడు సర్వేశ్వరరెడ్డి

సీతమ్మధార : రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని 27వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి అన్నారు. వార్డులోని దొండపర్తి పరిసర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై వివరించారు. ప్రజల సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సర్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ 2024లో జగనమోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. రాష్ట్ర అభివృద్ధిని చూడలేక టీడీపీ ఆరోపణలు చేస్తోందని, ప్రజలు అటువంటి ఆరోపణలు నమ్మరని అన్నారు. ఈ కార్యక్రమంలో రామాలయం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పాలికల సోమినాయుడు, సచివాలయ కన్వీనర్లు అంగటికుమారి, ఎస్.మల్లేశ్వరి, గృహసారథులు పి.త్రినాథ్, జె.గురుమూర్తిరెడ్డి, అప్పలరాజు, ఎస్.నర్సింగరావు, వెంకటరావు (బాబు), పి.రాజా, కనకరాజు, వెంకటలక్ష్మి, పి.రమణమ్మ, బాడితమాని వెంకటలక్ష్మి, టేకేటి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



అందజేసిన ట్యాబ్‌లతో విద్యార్థులు, నాయకులు, ఎంఈఓలు

అక్కిరెడ్డిపాలెం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జగన్ ఒక వరం అని 68వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్ అన్నారు. శనివారం మింది జిల్లా పరిషత్ హైస్కూల్లో 8వ తరగతి విద్యార్థులకు బైజూస్‌తో కూడిన ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. కోట్ల వ్యయంతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తయారు చేశారన్నారు. రూ.33 వేల ఖరీదు గల బైజూస్‌తో కూడిన ట్యాబ్‌లు అందజేయడం అభినందనీయమన్నారు. ఎంఈవో – 1 విశ్వనాథం, ఎంఈవో –2 ఎం.సునీత మాట్లాడుతూ విద్యార్థులు ఎవరైనా ట్యాబ్‌లను ఇతర సమాచారం కోసం వినియోగిస్తే విద్యార్థుల చైల్డ్ ఐడీ ద్వారా తెలిసిపోతుందన్నారు. అలాంటి వారి నుంచి ట్యాబ్‌లు స్వాధీనం చేసుకుంటామన్నారు. పాఠశాల హెచ్‌ఎం పి.వి.ఎస్.ఎస్.ఎస్.అంజనేయ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు వరదాడ వెంకటరమణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కంచర్ల ఉపేంద్రకు ఘంటసాల పురస్కారం



ఉపేంద్రను సత్కరిస్తున్న ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్ : అమర గాయకుడు ఘంటసాల 101వ జయంతి సందర్భంగా ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్, అమ్మాజమ్మ సూర్యప్రకాశరావు చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో అందరి నోట ఘంటసాల పాట శీర్షికన సినీ సంగీత విభావరి జరిగింది. ఈ సందర్భంగా ఉపేంద్ర గాడి అడ్డా తొలి చిత్రంతో హీరోగా ప్రత్యేక గుర్తింపు పొందిన హీరో ఉపేంద్రబాబును ఘంటసాల సేవా పురస్కారంతో ఘనంగా సత్కరించారు. ఆత్రేయ స్మారక కళా పీఠం కార్యదర్శి గంటి మురళి మాట్లాడుతూ వరుసగా ఆరు సినిమాల్లో హీరోగా నటిస్తూ, ఉపకార్ గ్రూప్స్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాల్లో ఉపేంద్ర ప్రధాన పాత్ర పోషించడం ప్రశంసనీయమన్నారు. హీరో కంచర్ల ఉపేంద్ర మాట్లాడుతూ కళలకు రాజధాని విశాఖలో ఎందరో కళాకారులు ఉన్నారని, తన తండ్రి కంచర్ల అచ్యుతరావు తీస్తున్న చిత్రాల్లో ఇక్కడి కళాకారులకు అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కందుల నాగరాజు, ఎంఎన్ కుమారి, ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు, పలువురు గాయనీ గాయకులు పాల్గొన్నారు.

'జగనన్న గోరుముద్ద' పరిశీలన



విద్యార్థుల ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఎంఈవోలు

అక్కిరెడ్డిపాలెం: జగనన్న గోరు ముద్దతో విద్యార్థులకు కావాల్సిన పోషకాలు అందుతున్నాయని ఎంఈవోలు ఎం.సునీత, విశ్వనాథం అన్నారు. శనివారం 68వ వార్డు మింది జిల్లా పరిషత్ హైస్కూల్లో జగనన్న గోరుముద్ద ఆహారాన్ని పరిశీలించారు. బిర్యానీ, సాంబారు, పరమాన్నం నాణ్యతను పరీక్షించారు. పాఠశాల హెచ్‌ఎం అంజనేయ నుంచి విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

నేడు హనుమత్ వ్రతం



మెయిన్‌రోడ్డులోని శ్రీ ఆంజనేయస్వామి

మహారాణిపేట: మెయిన్ రోడ్డులోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం హనుమత్ వ్రతం నిర్వహించనున్నారు. ఆదివారం తెల్లవారు జాము నుంచి స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో అల్లు జగన్నాథం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పూజలో పాల్గొనే భక్తులు దేవస్థానం కౌంటర్‌లో రూ. 216 చెల్లించి రశీదు తీసుకోవాలన్నారు. వీరికి లడ్డూ, పులిహోర ప్రసాదం, సింధూరం ఇస్తామన్నా రు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పునీతులు కావాలని దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ వడ్డాది దిలీప్‌కుమార్ కోరారు.

26 నుంచి ఏవీఎన్‌లో 'ఆహ్వాన్–2కే23'

హాజరు కానున్న సినీ తార అవికాగోర్, బుల్లెట్ భాస్కర్, ప్రసన్నకుమార్



ప్రత్యేక ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న అదీప్ భానోజీరావు తదితరులు



లఘు నాటిక ప్రదర్శిస్తున్న విద్యార్థులు

డాబాగార్డెన్స్ : నగరంలోని ప్రముఖ విద్యా సంస్థ ఏవీఎన్ కళాశాలలో ఈ నెల 26 నుంచి రెండ్రోజుల పాటు 'ఆహ్వాన్–2కే23'పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. తొలిరోజు కార్యక్రమంలో ప్రముఖ సినీ తార అవికాగోర్, జబర్దస్త్ ఫేం బుల్లెట్ భాస్కర్, ఐనవోలు ప్రసన్నకుమార్, రెండో రోజు కార్యక్రమంలో ప్రముఖ అంతర్జాతీయ మెజీషియన్ బీఎస్ రెడ్డి హాజరు కానున్నారు. ఈ మేరకు కళాశాల కరస్పాండెంట్ అదీప్ భానోజీరావు, ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు శనివారం కళాశాల ప్రాంగణంలో కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎగ్జిబిషన్‌ను ప్రముఖులు సందర్శించి విద్యార్థులను అభినందించారు. కిసాన్ దివస్‌ను పురస్కరించుకుని కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు(విద్యార్థులు) రైతులు పడే కష్టాల్ని వివరిస్తూ ప్రదర్శించిన లఘు నాటిక ఆకట్టుకుంది. పలువురు విద్యార్థులు రైతుల వేషధారణతో కూరగాయలు విక్రయించే స్కిట్ ప్రదర్శించారు. 26 నుంచి రెండు రోజుల పాటు జరగనున్న ఫెస్ట్‌కు సంబంధించిన వివరాల్ని నిర్వాహకులు వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, స్వరాజ్యలక్ష్మి, మీడియా కో ఆర్డినేటర్ పైడి రజని, గాంధీ, అర్చన, భానుమతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



సెమీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా కొవ్వొత్తులు వెలిగిస్తున్న జాన్‌వెస్లీ, జేసీ విశ్వనాథన్



వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవ సోదరులు



కేక్ కట్ చేస్తున్న జాన్ వెస్లీ, జేసీ విశ్వనాథన్ తదితరులు

మహారాణిపేట : జీవితంలో ఏ సందర్భంలోనైనా విశ్వాసంతో ముందుకు వెళితే, వారి వెంట దేవుడు అండగా ఉంటాడని, బైబిల్ కూడా అదే బోధిస్తుందని రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ డెవలప్‌మెంటు కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్ వెస్లీ అన్నారు. సెమీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా విశాఖపట్నం జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 'హై టీ'కార్యక్రమం ఘనంగా జరిగింది. జాన్ వెస్లీ, సంయుక్త కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్‌తో కలిసి కేక్ కట్ చేసి ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ ప్రపంచమంతా చేసుకునే ఏకైక పండగ క్రిస్మస్ అన్నారు. క్రైస్తవులుగా మనం అనుసరించే విధానాలే ఉన్నత స్థానంలో నిలుపుతాయన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ అణగారిన వర్గాలకు చెందిన ప్రజలను మేల్కొలిపి వారిలో యేసు ప్రభువు చైతన్యం కల్పించారని అన్నారు. ముందు ప్రార్థనా కార్యక్రమాన్ని డాక్టర్ ల్యూక్స్ మెమోరియల్ పాస్టర్ ప్రేమ్‌కుమార్ నిర్వహించారు.

సెయింట్ ల్యూక్స్ నర్సింగ్ కాలేజీ, సెయింట్ ల్యూక్స్ మైనారిటీ ఎడ్యుకేషనల్ సొసైటీ, కేథరిన్ గ్రూప్ సంస్థ విద్యార్థినులు ఏసు ప్రభువు ప్రార్థనా గీతాలు ఆలపించారు. రేవ హ్యారీ తోమస్, పాస్టర్ డాక్టర్ ల్యూక్స్ మెమోరియల్ చర్చి సందేశాన్ని అందించారు. లవ్–కేర్ మినిస్ట్రీస్ ఏసుపాదం, వైఎస్సార్‌సీపీ నాయకురాళ్లు పీలా వెంకట లక్ష్మి, కృపాజ్యోతి, అనిల్ పాల్, ఎన్జీవో అధ్యక్షులు ప్రజ్ఞ తదితరులు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాన్ని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి ఎస్. జ్యోతి మాధవి నిర్వహించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులు వెలిగించారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్ , జెడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు, జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల ఈడీ సయ్యద్ సిరాజుల్ల, జిల్లా పంచాయతీ అధికారి ఎం.వి.ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీల చాంపియన్స్‌కు అభినందన



విజేతలను అభినందిస్తున్న యల్లపు రఘురామ్, గొర్లె చందు

కంచరపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో భాగంగా నిర్వహించిన సీఎం కప్ బాక్సింగ్ ట్రోఫీ చాంపియన్‌షిప్ విజేతలైన విశాఖ జిల్లా జట్టును శనివారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, వీఎస్ విశాఖ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యల్లపు రఘురామ్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రారంభించడమే కాకుండా రూ.లక్షల్లో ప్రైజ్ మనీ డిక్లేర్ చేసి క్రీడాకారుల్లో పోటీతత్వం పెంచుతున్న సీఎం వైఎస్ జగన్ ప్రశంసనీయుడని కొనియాడారు. విజేత జట్టు సభ్యులకు అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వి.అమ్మోరు, సలహాదారుడు గొర్లె చందు, డాక్టర్ ఆర్‌వోసీ రూపెన్, కనకరాజు, సత్యనారాయణ, సునీల్, బి.ఎస్.వాసు, టి.వి.ఎస్.అనిల్‌కుమార్, సూర్యనారాయణ, తదితరులు అభినందనలు తెలిపారు.